క్లుప్తంగా

పాఠశాలలకు గ్లాసుల పంపిణీ

రామచంద్రాపురం: ప్రభుత్వం పంపిన రాగి జావ గ్లాసులను మండలంలోని పాఠశాలలకు బుధవారం ఎంఈఓ వెంకటసుబ్బమ్మ అందజేశారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని 56 ప్రభుత్వ పాఠశాలలకు 2,366 గ్లాసులు వచ్చినట్టు చెప్పారు. జగనన్న గోరుముద్దలో భాగంగా విద్యార్థుల్లో రక్తహీనత, పౌష్టికాహార లోపాలను అధిగమించడానికి ప్రభుత్వం రాగిజావ అందజేస్తోందని తెలిపారు. విద్యార్థులు రాగి జావను తాగడానికి గ్లాసులను వినియోగించుకోవాలని సూచించారు.

ఘనంగా ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

తిరుపతి కల్చరల్: అఖిల భారత యువజన సమాఖ్య 64వ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం సీపీఐ కార్యాలయ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఆ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి విక్కీ మహేశ్వర్ జెండా ఆవిష్కరించారు. ఏఐవైఎఫ్ మాజీ రాష్ట్ర సహాయ కార్యదర్శి రామానాయుడు మాట్లాడుతూ విద్య, వైద్యం, ఉపాధి మౌలిక వసతుల కల్పన కోసం ఏఐవైఎఫ్ రాజీలేని పోరాటాలు చేస్తోందని తెలిపారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం.రామకృష్ణ మాట్లాడుతూ మతోన్మాదానికి, కాషాయ భావజాలానికి వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. భగత్‌సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టం రూపొందించి అమలు చేయాలన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి నాగరాజు, సీపీఐ నేతలు రాధాక్రిష్ణ, ఎన్‌డీ.రవి, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉపాధి పనుల తనిఖీ



పాకాల : మండలంలో వల్లివేడు గ్రామంలో ఉపాధిహామీ కింద చేపట్టిన సప్లయి చానల్ పనులను బుధవారం డ్వామా పీడీ సీవీ.శ్రీనివాసప్రసాద్ తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి కూలీకి రోజుకు రూ.272 కూలి గిట్టుబాటు అయ్యేలా పనులు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాల్లో ప్రతి కూలీ వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. రోగ నిర్ధారణ అనంతరం కూలీల ఇంటికే 104 ద్వారా మందులు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. ఏపీఓ కళ్యాణి, జేఈ ఈశ్వర్, టీఏ బాలకృష్ణ పాల్గొన్నారు.

టీటీడీకి ఎలక్ట్రిక్ స్కూటర్ వితరణ



తిరుమల: తిరుపతి గాయత్రీ ఆటోమోటివ్‌కు చెందిన రవి బుధవారం రూ.1.08 లక్షల విలువైన బగుస్ సీ12ఐ మాక్స్ ఎలక్ట్రిక్ స్కూటర్‌ను టీటీడీకి వితరణ చేశారు. ఆయన స్కూటర్ తాళాలను శ్రీవారి ఆలయం ఎదుట డిప్యూటీ ఈవో లోకనాథంకు అందజేశారు. తిరుమల డీఐ జానకిరామిరెడ్డి పాల్గొన్నారు.

చోరీ కేసుల్లో నిందితుడికి జైలు

తిరుపతి లీగల్ : రెండు వేర్వేరు చోరీ కేసుల్లో తిరుపతికి చెందిన భూపతి వాసుకు ఒక్కో కేసులో 3 నెలల జైలు శిక్ష , రూ.100 చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు బుధవారం తీర్పుచెప్పారు. నిందితుడు వాసు ఈ ఏడాది వివిధ తేదీలలో, వివిధ ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలను చోరీ చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు ఈస్ట్ పోలీసులు కేసులు దర్యాప్తు చేసి వాసును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. అతను రెండు కేసుల్లో నేరం అంగీకరించడంతో న్యాయమూర్తి శిక్ష విధిస్తూ తీర్పుచెప్పారు.

జనావాసాల్లోకి చుక్కల దుప్పి



నీటి తొట్టెలో ఉన్న చుక్కల దుప్పి

చంద్రగిరి(తిరుపతి రూరల్): శేషాచల అడవుల నుంచి చుక్కల దుప్పి దారి తప్పి జనావాసాల్లోకి వచ్చింది. తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం ఏ రంగంపేట పంచాయతీ సాయి నగర్ లోని బాలుర వసతి సముదాయం వద్ద గల నీటి తొట్టెలో బుధవారం చుక్కల దుప్పిని స్థానికులు గుర్తించారు. అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చి దుప్పిని అప్పగించారు. దాన్ని అడవిలో వదిలేసినట్లు ఎఫ్‌బీఓ రవీంద్ర తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

తిరుపతి తుడా: వినాయక సాగర్ సమీపంలో ఉన్న రాధే శ్యామ్ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లో సమస్యలను పరిష్కరిస్తామని మేయర్ శిరీష తెలిపారు. ఆమె బుధవారం అధికారులతో కలిసి రెసిడెన్సీని పరిశీలించారు. అక్కడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎస్‌ఈ మోహన్, ఎంఈ వెంకటరామిరెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, అసోసియేషన్ సభ్యులు బాబురాజ్, వసుంధర, శ్రీకాంత్, సుధాకర్ రావు పాల్గొన్నారు.

నగర శాశ్వత అభివృద్ధే మా అజెండా

- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి
- శ్రీశ్రీ మార్గం ప్రారంభోత్సవం



శ్రీశ్రీ మార్గ్ బోర్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూమనరెడ్డి, మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్లు ముద్రనారాయణ, భూమన అభినయ్‌రెడ్డి, కార్పొరేటర్ ఎస్‌కే బాబు

తిరుపతి తుడా: తిరుపతి నగర శాశ్వత అభివృద్ధే తమ అజెండా అని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. 17వ డివిజన్‌లోని గ్రీన్ పార్క్ అపార్ట్‌మెంట్ వద్ద రూ.22.75 లక్షలతో ఏర్పాటుచేసిన మహాకవి శ్రీశ్రీ మార్గాన్ని బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తిరుపతి నగర ఉజ్వల భవిష్యత్తు, జనాభాను దృష్టిలో ఉంచుకుని మరో 50 ఏళ్ల అవసరాలకు తగినట్టు పక్కా ప్రణాళికలతో శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టినట్టు చెప్పారు. మేయర్ శిరీష మాట్లాడుతూ తిరు నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. కమిషనర్ హరిత మాట్లాడుతూ నగర పాలక సంఘంలో విలీనమైన పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెట్టామన్నారు. ఉప మేయర్ భూమన అభినయ్ రెడ్డి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం వచ్చాకే తిరుపతి అభివృద్ధి చెందుతోందన్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్లతో ప్రజలకు ట్రాఫిక్ నుంచి ఉపశమనం కలుగుతోందన్నారు. తక్కువ కాలంలోనే తిరుపతికి ఏమి చేశామో చెప్పుకునే ధైర్యం తమకు కలిగిందన్నారు. గ్రీన్ పార్క్ అపార్ట్‌మెంట్ వాసులు మాట్లాడుతూ 25 ఏళ్ల నుంచి రోడ్డు సమస్యతో బాధపడుతున్నామని తెలిపారు. తమ సమస్యను ఎమ్మెల్యే భూమన, డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా మూడు రోజుల్లోనే పరిష్కారం చూపారని కొనియాడారు. కార్యక్రమంలో ఉప మేయర్ ముద్ర నారాయణ, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు ఎస్.కె.బాబు, కార్పొరేటర్లు ఆంజనేయులు, నరసింహ ఆచారి, రత్న కుమారి, గ్రీన్‌పార్క్ అభివృద్ధి కమిటీ సభ్యులు విజయకుమార్‌రెడ్డి, సుబ్రమణ్యం, ఉమామహేశ్వరరావు, రామానందం, మురళి, వంశీ, తులసీరామ్, శైలజ, టీచర్ మోహన్‌రెడ్డి, రమణయ్య, రామకృష్ణ, ఉపేంద్రయ్య, అదనపు కమిషనర్ సునీత, ఎస్‌ఈ. మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్ రోడ్ల పనుల పరిశీలన

తిరుపతి తుడా: గంగమ్మ గుడి మాస్టర్ ప్లాన్ రోడ్డు పనులను బుధవారం ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి, మేయర్ శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, భూమన అభినయ్‌రెడ్డి పరిశీలించారు. రెండు మూడు రోజుల్లో పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ఎమ్మార్‌పల్లి కూడలి నుంచి మహిళా యూనివర్సిటీ వరకు వేస్తున్న సీతమ్మ నగర్ మాస్టర్ ప్లాన్ రోడ్డును డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తనిఖీ చేశారు. పనుల్లో నాణ్యత ఉండాలని, వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భూమన, మేయర్, డిప్యూటీ మేయర్లు

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం

తిరుపతి రూరల్: చారిత్రక నేపథ్యం కలిగిన చంద్రగిరి సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తానని డీఎస్పీ టీడీ యశ్వంత్ తెలిపారు. నూతనంగా ఏర్పడిన చంద్రగిరి సబ్ డివిజన్ ప్రథమ డీఎస్పీగా ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలో ఎర్రచందనం అక్రమ రవాణాను అడ్డుకుంటామన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా పల్లెల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పుతామన్నారు. వేసవి నేపథ్యంలో ఇళ్లలో చోరీలు అరికట్టేందుకు బీటు వ్యవస్థను బలోపేతం చేస్తామన్నారు. ఆయనను సీఐలు సురేంద్రరెడ్డి, రాజశేఖర్, ఓబులేసు, తులసీరాం, సుబ్రమణ్యంరెడ్డి, ఎస్‌ఐలు అభినందించారు.



ఎమ్మెల్యే చెవిరెడ్డిని కలిసిన డీఎస్పీ యశ్వంత్

ఎమ్మెల్యేను కలిసిన డీఎస్పీ

డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన యశ్వంత్ అనంతరం చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

మీ బిడ్డగా ఆశీర్వదించండి



మోహిత్‌రెడ్డికి మాజీ సర్పంచ్ బాబీ సన్మానం



మోహిత్‌రెడ్డిని ఆప్యాయంగా పలుకరిస్తున్న వృద్ధురాలు

- ప్రతి సమస్యకూ పరిష్కారం చూపిస్తా
- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

భాకరాపేట : 'మీ బిడ్డగా మీ ముందుకు వచ్చాను. ప్రతి సమస్యకూ పరిష్కారం చూపిస్తాను. ఆశీర్వదించండి' అని చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అభ్యర్థించారు. ఆయన బుధవారం ఎగవూరు, దిగవూరు పంచాయతీల్లో గడప గడపకూ మహా పాదయాత్ర చేపట్టారు. ఆయనకు మహిళలు హారతి పట్టి స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ జగనన్న చేపట్టిన సంక్షేమం కారణంగా ఏ ఇంటికి వెళ్లినా విశేషంగా ఆదరిస్తున్నారని తెలిపారు. కనీవినీ ఎరుగని రీతిలో స్వాగతం పలికి తమ బిడ్డగా ఆశీర్వదించడం సంతోషాన్ని ఇస్తోందని తెలిపారు. నాన్న, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి బాటలోనే నడుస్తానని పేర్కొన్నారు.

సమగ్రంగా భూసర్వే

తిరుపతి తుడా : జగనన్న భూ శాశ్వత హక్కు రీసర్వేను సమగ్రంగా నిర్వహించాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత ఆదేశించారు. ఆమె బుధవారం వినాయక సాగర్ వద్ద రీ సర్వే డ్రోన్ ఫ్లయింగ్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఐరోడైన్ సంస్థ ద్వారా పక్కాగా భూ సర్వే పనులను చేపట్టనున్నట్టు తెలిపారు. తిరుపతి కార్పొరేషన్ పరిధిలో 5000 సర్వే నంబర్లు, 27 స్కైవర్ యార్డ్స్, 50 డివిజన్లు, 102 సచివాలయాల్లో సర్వే నిర్వహిస్తామన్నారు. మున్సిపల్ కార్పొరేషన్, అర్బన్ తహసీల్దార్, సచివాలయ సిబ్బంది భాగస్వాములవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అర్బన్ తహసీల్దార్ వెంకటరమణ, అదనపు కమిషనర్ సునీత, ఏసీపీ బాలసుబ్రమణ్యం, టీపీవోలు సాయిలీల, శారదాంబ, ధర్మరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



డ్రోన్‌ను ప్రారంభిస్తున్న కమిషనర్ హరిత

లిఫ్ట్ విక్రేతపై ఛీటింగ్ కేసు నమోదు

తిరుపతి లీగల్ : లిఫ్ట్ బిగిస్తామంటూ నగదు తీసుకుని మోసం చేసిన కేసులో తొండవాడకు చెంది ప్రస్తుతం హైదరాబాద్ కూకట్‌పల్లిలో ఉంటున్న మేఘనాథ్‌పై కోర్టు ఆదేశాలతో ఛీటింగ్ కేసు నమోదు చేశారు. ఫిర్యాది వై.నాగేంద్రబాబు బుధవారం మీడియాకు వివరాలు వెల్లడించాడు. నాగేంద్రబాబు తిరుపతి పరిసర ప్రాంతాల్లో అపార్ట్‌మెంట్ల నిర్మాణం చేస్తున్నాడు. తొండవాడ వద్ద అంజనాద్రి రెసిడెన్సీ పేరుతో అపార్ట్‌మెంట్ చేపట్టాడు. దానికి లిఫ్ట్ ఏర్పాటు చేయాలని అతను భావించాడు. అదే ప్రాంతానికి చెందిన మేఘనాథ్ తాను హైదరాబాద్ ఎస్‌ఆర్ నగర్‌లో మేఘన ఎలివేటర్స్ పేరుతో లిఫ్ట్‌లు ఏర్పాటుచేసే వ్యాపారం చేస్తున్నట్లు చెప్పి 2018లో రూ.లక్ష తీసుకున్నాడు. ఎంతకాలమైనా లిఫ్ట్ ఏర్పాటు చేయకపోవడంతో నాగేంద్రబాబు ప్రశ్నించాడు. తాను నష్టాల్లో ఉన్నానని, ఖర్చులు పెరిగాయని, రూ.1.50 లక్షలు చెల్లిస్తే లిఫ్ట్ ఏర్పాటుచేస్తానని మేఘనాథ్ తెలపడంతో ఆ మొత్తాన్ని నాగేంద్రబాబు చెల్లించాడు. అలాగే ఈ ఏడాది ఫిబ్రవరి 27న తన అవసరాలకు రూ.70 వేలు కావాలంటూ మేఘనాథ్ అడిగాడు. అతను డబ్బు ఇవ్వగా లిఫ్ట్ ఏర్పాటుకు ఉపయోగపడే 12 వస్తువులను మాత్రం అతనికి ఇచ్చాడు. వాటిని నాగేంద్రబాబు ఓ టెక్నీషియన్‌కు చూపించగా ఇంకా కొన్ని వస్తువులు ఇవ్వలేదని, అవి కచ్చితంగా కావాలని సూచించాడు. ఈ విషయంపై మేఘనాథ్ గురించి విచారించగా హైదరాబాద్‌లో అతని పేరున ఎటువంటి సంస్థలు లేవని తేలింది. దీంతో నాగేంద్రబాబు హైదరాబాద్ 4వ చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో ఫిర్యాదు చేశాడు. ఆ ఫిర్యాదును పరిశీలించిన కోర్టు మేఘనాథ్‌పై ఐపీసీ 352, 406, 420, 421 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని పోలీసులను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

రేపు కపిలేశ్వరాలయంలో పత్ర పుష్పయాగం

- నేడు అంకురార్పణ

తిరుపతి కల్చరల్: కపిలేశ్వరాలయంలో శుక్రవారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు స్వామి వారికి పత్ర పుష్పయాగం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా గురువారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ చేపట్టనున్నారు. మే 5వ తేదీ ఉదయం 7.30 నుంచి 9.30 గంటల వరకు కపిలేశ్వరస్వామి, కామాక్షి అమ్మవారి ఉత్సవర్లకు నవ కలశ స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పత్ర పుష్పయాగం వైభవంగా సాగనుంది.

బాధ్యతలు స్వీకరించిన జడ్జిలు

తిరుపతి లీగల్ : తిరుపతికి బదిలీపై కొత్తగా వచ్చిన ముగ్గురు జూనియర్ సివిల్ జడ్జిలు బుధవారం బాధ్యతలు చేపట్టారు. బి.వాణిశ్రీ, తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తూ తిరుపతి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీపై వచ్చారు. అలాగే జడ్జి ఎం.సంధ్యారాణి అన్నమయ్య జిల్లా రాజంపేట జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తూ బదిలీపై తిరుపతి 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా వచ్చారు. వీరు స్థానిక 5వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి సరిత నుంచి బాధ్యతలు స్వీకరించారు. అదేవిధంగా రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ కోర్టు జూనియర్ సివిల్ జడ్జిగా ఎస్.శ్రీకాంత్ బుధవారం స్థానిక 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ నుంచి బాధ్యతలను స్వీకరించారు. ఈయన కర్నూలు జిల్లా ఆదోని 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తూ బదిలీపై వచ్చారు.

తిరుపతి రూరల్ తహసీల్దార్‌గా సుబ్రమణ్యం



తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ తహసీల్దార్‌గా టీవీ సుబ్రమణ్యం బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన బుచ్చినాయుడుకండ్రిగ తహసీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న లోకేశ్వరి చిన్నగొట్టిగల్లు మండలానికి బదిలీ అయ్యారు. అనంతరం తహసీల్దార్ టీవీ సుబ్రమణ్యం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

తల్లీకొడుకులకు కన్నీటి వీడ్కోలు

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం బుచ్చినాయుడుపల్లి పంచాయతీ తుంగరాంపల్లిలో కొడుకు మృతిని తట్టుకోలేక తల్లి ప్రాణం విడిచిన సంఘటన విధితమే. తల్లీకొడుకులకు బుధవారం బంధువులు, కుటుంబ సభ్యులు కన్నీటి వీడ్కోలు పలికారు. తుంగరాంపల్లి వాసులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఘనంగా నివాళులర్పించారు. చంద్రగిరి ఎంపీపీ హేమేంద్రకుమార్ రెడ్డి, సర్పంచ్ రవి దహన సంస్కారాల్లో పాల్గొన్నారు. చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సచివాలయాలతోనే గ్రామాల అభివృద్ధి

చంద్రగిరి(తిరుపతి రూరల్): సచివాలయాలతో గ్రామాల అభివృద్ధి వేగవంతంగా జరుగుతోందని చంద్రగిరి ఎంపీపీ హేమేంద్రకుమార్ రెడ్డి అన్నారు. మిట్టపాలెంలో నిర్మించిన సచివాలయాన్ని బుధవారం ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ భవనంలో ఇంటర్నెట్ సదుపాయం లేకపోవడంతో పాత పంచాయతీ భవనం నుంచే ఇప్పటి వరకు పరిపాలన చేపట్టారు. సౌకర్యాలు పూర్తి స్థాయిలో కల్పించడంతో బుధవారం నుంచి పంచాయతీ పాలన నూతన సచివాలయం నుంచే చేపట్టినట్టు సర్పంచ్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఉప సర్పంచ్ వేణు, కార్యదర్శి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

డెఫ్ ఇండియన్ ప్రీమియర్ లీగ్-2023కు ఎంపిక



తిరుపతి ఎడ్యుకేషన్: చిత్తూరు జిల్లా, నగరి పట్టణంలోని కేవీఆర్ పేట వీధికి చెందిన కేవీ ఏలుమలై డెఫ్ ఇండియన్ ప్రీమియర్ లీగ్-2023కు ఎంపికయ్యాడు. ఆయనను పలువురు అభినందించారు.

ఘనంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ట



పద్మావతి అమ్మవారి ఆలయం

తిరుపతి ఎడ్యుకేషన్ : పద్మావతి మహిళా వర్సిటీలో టీటీడీ సహకారంతో పద్మావతి అమ్మవారి ఆలయ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఈ క్రమంలో బుధవారం పద్మావతి అమ్మవారి విగ్రహాన్ని శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. ఇన్‌చార్జ్ వీసీ కే.రాజారెడ్డి, రిజిస్ట్రార్ ఎన్.రజని మాట్లాడుతూ క్యాంపస్ ఆవరణలో పద్మావతి అమ్మవారి ఆలయ నిర్మాణాన్ని టీటీడీ ఈఓ ఏవీ.ధర్మారెడ్డి ఆధ్వర్యంలో నిర్మించడం శుభపరిణామమన్నారు. ఇక్కడ చదివే విద్యార్థినుల్లో చదువుతో పాటు భక్తి భావాలు పెంపొందనున్నాయని పేర్కొన్నారు.

● వాలీబాల్ జట్టులో తల్లీకూతుళ్లు



సీఎం కప్ టోర్నీలో భాగంగా బుధవారం జరిగిన వాలీబాల్ పోటీల్లో విశాఖపట్టణం- ప్రకాశం జిల్లాల బాలికల విభాగం జట్లు తలపడ్డాయి. ఇందులో అనకాపల్లిలో పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రంజని, విశాఖపట్టణం జిల్లా జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నారు. ఆమె కుమార్తె చరిష్మా కూడా అదే టీమ్‌లో ఉన్నారు. వారిని ఆ టీం కోచ్ కోటేశ్వరరావు అభినందించారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

కేంద్ర మంత్రికి ఘన స్వాగతం



తిరుపతి గాంధీ రోడ్: కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మెగ్వాల్ బుధవారం తిరుపతి నగరంలోని వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చారు. ఆయనకు సంస్కృత విద్యాపీఠంలో బీజేపీ నాయకుడు గుండాల గోపీనాథ్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. మంత్రి మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. సుబ్రహ్మణ్యం రెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి, మల్లారపు రవి ప్రసాద్, జయంతి కుమార్, దీపక్ యాదవ్ పాల్గొన్నారు.

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం ఎ.రంగంపేటలో ఏడుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.2,130 స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. ఏ రంగంపేట సచివాలయం సమీపంలో చెట్టు కింద పేకాట ఆడుతుండగా దాడి చేసినట్టు తెలిపారు.

విజయకుమారికి డాక్టరేట్



తిరుపతి ఎడ్యుకేషన్ : పరిశోధక విద్యార్థిని విజయకుమారికి ఎస్వీయూ డాక్టరేట్ అందజేసింది. ఆమె పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల తెలుగు విభాగాధిపతి వి.కృష్ణవేణి పర్యవేక్షణలో ఆదెల్ల శివకుమర్ నవలలు-పరిశీలన అనే అంశంపై పరిశోధన చేశారు.